# అద్దం

**నేను కవిత్వం వ్రాస్తాను. నేను రాసిన కవితలు వివిధ వారపత్రికల్లో అచ్చయ్యాయి.**

నీలాకాశం చూసినా, మేఘాలతో దోబూచులాడే చంద్రుడ్ని చూసినా, గుంపులుగా ఎగిరే పక్షుల్ని చూసినా, పచ్చటి ప్రకృతిని చూసినా, నా మనసులో కవిత్వం పొంగి పొరలుతుంది. కవయిత్రిగా నాకు మంచి పేరు వుంది.

'నా' అని చెప్పుకుందికి నాకెవ్వరూ లేదు. అమ్మ, నాన్న నా చిన్నప్పుడే పోయారు. మేనత్త నన్ను పెంచి పెద్ద చేసింది. బి.కామ్. అయిపోయాక ఈ వైజాగ్‌లోనే ఏదో చిన్న ఉద్యోగం సంపాదించుకున్నాను. వర్కింగ్ వుమెన్స్ హాస్టల్లో వుందామంటే కొన్ని యిబ్బందులు ఎదురయ్యాయి. అందుకే ఒకరింట్లో పేయింగ్ గెస్ట్‌గా వుంటున్నాను. రవీంద్ర ఆ ఇంటివాళ్ల అబ్బాయి. ఒక్కడే కొడుకు! బ్యాంకులో పనిచేస్తున్నాడు. చాలా అందగాడు, స్ఫురద్రూపి. వాళ్లమ్మకి ముద్దుల కొడుకు. ఆ యింట్లో అందరూ చాలా సరదాగా వుంటారు. ఆ ఇంట్లో వుండడం నాకు చాలా ఆనందాన్ని కలిగిస్తున్నది.

నాకు అద్దం అంటే చాలా యిష్టం. రోజూ అట్నుంచి వచ్చి ఒకసారి, ఇట్నుంచి వచ్చి ఒకసారి; అద్దంలో నన్ను నేను చాలాసార్లు చూసుకుంటూ వుంటాను. అద్దంలో చూసుకుంటూ వుంటే ఎవరి మటుకు వారు బాగానే వున్నట్టు అనుకుంటారు. ఎవరి మటుకు వాళ్లు బాగున్నట్టు అనుకోకపోతే బ్రతకడం కష్టం! అద్దంలో చూడగా చూడగా మన ముఖాలు మనకే అందంగా కనిపిస్తాయి. తినగ తినగ వేము తీయనగును. నా మటుకు నేనూ అంతే.

రవీంద్ర నాతో సరదాగా మాట్లాడతాడు. వయసు నాకన్నా కొంచెం ఎక్కువే వుండొచ్చు. కాని నన్ను 'మీరు' అని సంబోధించి మర్యాదగా మాట్లాడతాడు.

నేను కవిత్వం వ్రాస్తానని ఒకరోజు రవీంద్రతో చెప్పాను.

"అంటే మీ కవిత్వం చదివి జనాలు యింకా ఆరోగ్యంగానే వున్నారన్నమాట!" భళ్లున నవ్వాడు.

కవితలు నా ప్రాణం. నా సర్వస్వం. నా కవితల్ని ఎవరైనా అపహాస్యం చేస్తే నాకు చాలా బాధ కలుగుతుంది.

"ఏం? నా కవిత్వం అంత చీప్‌గా వుంటుందనుకున్నారా?"

"అమ్మో! కోపం తెచ్చుకోకండి. వూరికనే జోకువేసాను, అంతే!" తమాషాగా నవ్వాడు. నేను కూడా నవ్వేసాను.

"మీరు నన్ను 'మీరు' అనకండి. 'నువ్వు' అంటే చాలు". అన్నాను అతని కళ్లల్లోకి చూస్తూ. రవీంద్ర జవాబివ్వలేదు. నేను కవిత్వం వ్రాస్తానని రవీంద్రకి తెల్సు. అయినా "మీరు వ్రాసిన కవితలు యివ్వండి, చదువుతాను", అంటాడేమోనని ఎదురు చూసాను. కాని అతను ఆమాటే ఎత్తలేదు.

రవీంద్ర తండ్రి చంద్రశేఖరం గారు నా కవితల్ని చదివి ఎప్పటికప్పుడు మెచ్చుకుంటూనే వుంటారు. సుశీలగారు కూడా నా కవితలు చదివి సంతోషిస్తుంది.

చంద్రశేఖరం గారికి, సుశీల ఆంటీకి నేనంటే చాలా అభిమానం. నేను చాలా బుద్ధిమంతురాలినని, ఈ కాలంలో పుట్టవల్సిన దానిని కాదని వాళ్ల అభిప్రాయం. నా సంస్కారం, మాటతీరు, ప్రవర్తన అన్నీ వాళ్లని బాగా ఆకట్టుకున్నాయి!... నాలో ఏవో ఆశలు!!?

ఒక అమ్మాయి మనసులో ఆశలు అల్లుకు పోవడానికి అందంతో పనిలేదు!

నేను ఆ కుటుంబంతో బాగా కల్సిపోయాను. రవీంద్రతో మాట్లాడుతూంటే ఏదో చెప్పలేని హాయి కలుగుతుంది నాకు.

ఒకరోజు బస్సు మిస్సయి నేను ఆఫీసునించి నడుచుకు వస్తూ వుంటే స్కూటరు మీద రవీంద్ర కనిపించాడు. నన్ను చూడగానే నా పక్కగా స్కూటరు ఆపి "ఇంటికేనా! రండి!" అన్నాడు. నా వళ్లు ఝల్లుమంది. ఆ అనుభూతి మాటల్లో వర్ణించలేను. నవ్వుతూ స్కూటరు ఎక్కాను. నా మనసునిండా గజిబిజి ఆలోచనలు. అతని భుజాలు, వీపు వుండుండి నాకు తగుల్తూంటే ఏదో చెప్పలేని హాయి కలిగింది. ఇంట్లోకి వెళ్లగానే.

"మమ్మీ! సాకేత బస్సు మిస్సయింది. నేను వస్తూంటే తోవలో కనిపించింది. పాపం నడుచుకు వస్తూంది. అందుకే లిఫ్ట్ యిచ్చాను." వాళ్ల అమ్మతో చెప్తున్నాడు.

అలా చెప్పడం నాకు బాగుంది. నేను మౌనంగా వుండిపోయాను. నాగదిలో కెళ్లాక అనుకున్నాను. "రవీంద్రకి నేనంటే యిష్టమా? 'ఇష్టం' వుండబట్టే అలా స్కూటరు మీద ఎక్కించుకుని తెచ్చాడు. ఇష్టం లేకపోతే ఆ పని చేస్తాడా?!'

నాకు డైరీ వ్రాసే అలవాటుంది. నా డైరీ నా మనసుకి అద్దం లాంటిది. డైరీ చదివితే నా మనసు చదివినట్టే! అందుకే ఎవరూ చదవకూడదని భద్రంగా దాచుకుంటాను దాన్ని. మనసుని తాకే ఏ చిన్న సంఘటనకైనా, నా మనసు విపరీతంగా స్పందిస్తుంది. జరిగినదంతా నా డైరీలో వ్రాసుకున్నాను. మర్నాడు రవీంద్ర పుట్టినరోజు!

రాత్రి నా భావావేశాన్ని అక్షరాలుగా మార్చి అందమైన కాగితంమీద పెట్టి, ఆ కాగితాన్ని పుష్ప గుచ్ఛం లోపల పెట్టి మర్నాడు పార్టీకి వచ్చి వాళ్లందరూ వెళ్లిపోయాక దాన్నిచ్చాను. రవీంద్ర దాన్నందుకున్నాడు. ఆ మర్నాడు అతని ముఖంలోని ఫీలింగ్స్ చూసాను. అతను మామూలుగానే వున్నాడు. తను నవ్వుతూ, అందర్నీ నవ్విస్తూ.

నాకు ఆత్రుత, ఆరాటం పెరిగి పోతున్నాయి. రవీంద్ర నేను పెట్టిన కాగితం చదివాడా? లేదా? ... అని.

"మీ కవిత్వం చాలా బాగుంది. ఏమో అనుకున్నాను. కాని మీరు చాలా బాగా వ్రాసారు. సింపుల్ అండ్ సుపర్బ్. థాంక్స్" అంటాడనుకున్నాను.

కాని రెండు రోజుల తర్వాత పెరట్లో డస్ట్‌బిన్‌లో వాడిపోయిన ఫ్లవర్ బొకే కనిపించింది. ఆత్రంగా వెళ్లి చూసాను. అందులో నేను పెట్టిన కాగితం అలాగే వుంది!

ఒక్కసారిగా నాకు నీరసం వచ్చేసింది. పర్వత శిఖరం దాకా వెళ్లి అక్కడ నించున్న దాన్ని దబ్బున పక్కనున్న లోయలో పడిపోయినట్టు అనిపించింది... సభల్లో ముఖ్య అతిథులకీ గౌరవ అతిథులకీ పూలదండలు వేస్తారు. మీటింగులు అయిపోయాక వాటిని తీసుకెళ్లరు, ఆ ప్రముఖులు. అలాగే, నా బొకేకూడా నిరాదరణ పాలైంది. అందులో నా కవితాత్మక సందేశం ఉన్నట్టు రవీంద్రకి తెలియదుకదా అని సరిపెట్టుకున్నాను.

ఒకరోజు సుశీల ఆంటీగారు నా చేతికి కాఫీ కప్పు యిస్తూ "రవికిచ్చి రామ్మా!" అంది.

నేను అమ్మా-నాన్న; వూరూ-పేరు లేనిదాన్ని. అందం కాని, ఆర్థిక స్తోమత కాని లేనిదానిని. కానీ, ఈ కుటుంబంలో అందరూ నన్ను ఆప్యాయంగా చూసుకుంటున్నారు. అని ఆ కాఫీకప్పు అందించే అవకాశం ఇంకా ఏ సదావకాశానికి పునాదిగా నిలుస్తుందో అని సంతోషం చెందేను. రవీంద్ర నవ్వుతూ కాఫీ కప్పు అందుకున్నాడు.

"కూర్చో సాకేతా!" అన్నాడు. నా మాట మన్నించి నన్ను ఏకవచన ప్రయోగం చేసినందుకు నేను ఒక ఆత్మీయుడు దొరికినంతగా పొంగిపోయాను.

రవీంద్ర సరదాగా కబుర్లు చెప్పాడు. కొంత సేపటికి సుశీల ఆంటీ వంటింట్లోంచే కేకేసి రవీంద్రని పిల్చింది. రవీంద్ర లేచి వెళ్లిపోయాడు. నా ఆనందంమీద నీళ్లు చల్లినట్టుగా అయింది. నాకు ఏడుపొచ్చింది. నాకు ఏమీ లేకపోయినా అందమైన మనసు వుంది! కాని అది ఎవరికీ బాహాటంగా కనబడదు!!

రవీంద్ర యింట్లో వున్నంత సేపూ నవ్వుల జల్లులే!!

ఒకరోజు వాళ్లింటికి వాళ్ల బంధువులమ్మాయి వచ్చింది. పేరు 'ఉష'. చాలా చక్కగా వుంది. ఆమె శరీరం లేత గులాబీ రంగులో వుంది. ఆడ పిల్లనైన నాకే ముద్దొచ్చేలా వుంది! ఆ అమ్మాయి సుశీల ఆంటీకి వేలువిడిచిన మేనకోడలు. చాలా చలాకీగా వుంది! సన్నని నడుం, వెడల్పాటి కళ్లు, దొండపళ్లలాంటి పెదవులు, ఆడవాళ్ళకే అసూయ పుట్టేలా ఉంది ఆమె అందం. హైదరాబాదులో ఎమ్.ఎస్.సి. చదువు తుందట. సుశీల ఆంటీ, చంద్రశేఖరంగారు, రవీంద్ర, ఉష అందరూ చాలా హుషారుగా వున్నారు. మధ్య మధ్య నన్ను కూడా పిలుస్తున్నారు ఆనందాలు పంచుకోవడానికి!

ఉష రెండు రోజులుండి వెళ్లిపోయింది. ఆ అమ్మాయి వున్న రెండురోజులూ రవీంద్ర ఉషకి విశాఖపట్నం అంతా చూపించాడు.

వాళ్లిద్దరూ అలా వెళ్తున్నప్పుడు నన్ను కూడా పిలవొచ్చు కదా. కాని రవీంద్ర మాట వరసక్కూడా నన్ను పిలవలేదు. నేను చాలా నొచ్చుకున్నాను. అనుమానం, అసూయ కలిగాయి.

రవీంద్ర మనసు అర్థంకాని ప్రశ్నలా వుంది. మాట్లాడేటప్పుడు చాలా సరదాగా నేనంటే ఎంతో యిష్టం వున్నట్టుగా మాట్లాడతాడు. తర్వాత... అసలేమీ పట్టించుకోనట్టే వుంటాడు! నాకు అయోమయంగా వుంది! నా ఆశలు... ఆలోచనలు... ఊహలు... కలలు... అన్నీ రవీంద్ర చుట్టూ తిరగడం మొదలెట్టాయి. రవీంద్రని వదిలి రానని మొరాయిస్తున్నాది నా మనసు. నా మనసు బొత్తిగా నా మాట వినడం మానేసింది. నా మనోభావాలు, మానసిక సంఘర్షణ, నా ఆశలు, స్పందనలు అన్నీ ప్రతీ రోజూ డైరీలో వ్రాసుకుంటున్నాను. అలా కొన్ని రోజులు గడిచి పోయాయి.

ఒకరోజు పిడుగులాంటి వార్త విన్నాను.

రవీంద్రకి పెళ్లి నిశ్చయమైంది. నా కాళ్ల క్రింది భూమి కదిలినట్టయింది.

నా కళ్లమ్మట నీళ్లు తిరిగాయి. గబగబా నా గదిలోకొచ్చి తనివితీరా ఏడ్చాను. నా దురదృష్టానికి నన్ను నేను తిట్టుకున్నాను. రవీంద్ర నాతో కబుర్లలో ఉండగా ఆంటీగారు అతన్ని ఏదో పనున్నట్టు పిలుస్తూ ఉండినప్పుడే ఆమెకిష్టంలేదన్న విషయం అర్థం చేసుకోవల్సింది! అంత సరదాగా నాతో ఎప్పుడూ మాట్లాడే రవీంద్ర నా మనసు తెలుసుకోకపోవడం కారణం కాదని, నేనంటే యిష్టం లేకపోవడం కారణం అని తెల్సుకున్నాను. ఆ వయసులో వున్న కుర్రాళ్లు ఏ అమ్మాయితోనైనా అలా సరదాగా మాట్లాడతారని అప్పుడు తెల్సుకోలేక పోయాను. తను స్థితిగతులు తెల్సుకోకుండా ఏవో వెర్రి-మొర్రి ఆశలు పెట్టేసుకుని తర్వాత మానసికంగా చిత్రవధ అనుభవించే నాలాంటి అమ్మాయిలు... యింకా వున్నారో లేరో నాకు తెలీదు. కాని నేను మాత్రం వున్నాను. నేను పిచ్చిదాన్ని! ఎంతసేపూ నావైపు నుంచి ఆలోచించాను. రవీంద్ర చుట్టూ ఆశలు అల్లుకున్నాను. కాని అతని మనసేమిటో తెల్సుకోలేకపోయాను. కనీసం ఉష వచ్చినప్పుడైనా పరిస్థితి అర్థం చేసుకోవల్సింది. ఉష అక్కడున్నది రెండురోజులే. కాని, ఆ రెండు రోజుల్లో రవీంద్ర నా ఉనికినే మరచినంత తన్మయంగా ఆమెతో ఉన్నాడు ఇంటా బైటా. ఐనా సరే, ఏదో వాళ్ల బంధువుల అమ్మాయి, వూరికే వచ్చి వుంటుందని అనుకున్నాను. అద్దంలో నన్ను నేను చూసుకుంటూ రవీంద్ర నా వెనుకగా నిలబడి, నా నడుం చుట్టూ చేతులు వేసి దగ్గరకు తీసుకుంటున్నట్టుగా ఊహించుకుంటూ మురిసిపోయాను. కాని అదే అద్దంలో నా ముఖం బాగులేదని, నేను బాగుండననే కఠోర వాస్తవాన్ని అంగీకరించడానికి నా వెర్రి మనసు ఒప్పుకోవడంలేదు!!

రవీంద్ర అందగాడు. ఉష అందమైనది!

ఇద్దరూ వావివరసలు కలిసిన ఆత్మీయ బంధువులు...

ఒక అబ్బాయి తనతో సరదాగా మాట్లాడినంత మాత్రాన ఆ అమ్మాయి ఊరికే ఊహలు అల్లుకోకూడదన్న "నిజం" పొరలు కప్పిన నా మనసుకి తట్టలేదు!!

"నా అనుభవం నాలాంటి అమ్మాయిలకి కనువిప్పు కావాలి" అనుకున్నాను.

సుశీల ఆంటికి చెప్పి వర్కింగు ఉమెన్స్ హాస్టల్‌కి వచ్చేసాను.

నా అద్దం!... అద్దం ముందునేను!

అద్దం పరిష్కారం చూపదు. పరిస్థితి వివరిస్తుంది. అంతే!

అద్దంలో నన్ను నేను చూసుకున్నాను.

-ఈసారి ఆ అద్దం అబద్ధమాడకుండా నేనెవరో నాకు తెలియ జెప్పింది...

★ ★ ★

*(అముద్రితం)*